# ''వరల్డ్ ఎయిడ్స్ డే''

రమణయ్య ఆఫీసు నుంచి సాయంత్రం ఇంటికి తిరిగి రాగానే, పడక గదిలోకి ప్రవేశించి తన షర్ట్‌విప్పి హ్యాంగర్‌కు తగిలించి, ప్యాంట్ జేబునుంచి ఒక చిన్న ప్యాకెట్ తీసి డ్రస్సింగ్ టేబిల్ మీద పెట్టాడు. ఇది రోజూ జరిగే కార్యక్రమమే. అంటే, ఆరున్నర గంటలకి ఇంటికి రావడం, డోర్ బెల్ మ్రోగించిన వెంటనే సాక్షాత్ కమలాక్షి, సంతోషాక్షులతో గాని, సంతాపాలతోగాని, కోపాక్షులతోగాని, భాదరహితాక్షులతో గాని ప్రత్యక్షం కావడం, తదుపరి ఇద్దరూ కలిసి చక్కగా పడకగదిలోకి వెళ్లడం, వాళ్ల దినచర్యలో ఒక భాగం. దానికి కారణం వేరే ఏమీ కాదండీ, అలసిపోయి వచ్చే, సదరు భర్తకు ఇంటికి చేరగానే, ఆఫీసు బట్టలు తీసేసి (త్యజించి), తనకు ప్రియమైన బనియన్, లుంగీలోకి దూరిపోతేనే ఆయనకు సగం అలసట తీరుతుంది. మిగతా అలసట తీర్చడానికి, అతని అర్థాంగి(ని) వేడివేడి తేనీరుతో మరి ఐదు నిముషాలలో రంగప్రవేశం చేస్తుంది. అయితే ఆ రోజు అలవాటుగా తన చొక్కా విప్పివేశాడు. కానీ ప్యాంట్ జేబులోంచి ఒక చిన్న ప్యాకెట్ తీసి డ్రస్సింగ్ టేబుల్ మీద పెట్టడమనేదే ఆరోజు ప్రత్యేకత. కమలాక్షి తీక్షాక్షులు ఒక రెండు క్షణాలపాటు, ఆ పొట్లాన్ని పరీక్షించాయి. మరో క్షణంలో ఆమె ఆకాంక్షాభరిత శబ్దాలు, ఇలా బహిర్గతమయినాయి.

''ఏమిటి ఆ పొట్లాం? మీ జీతం ఇంత చిన్న పొట్లంలో రాదే!''

కమలాక్షి రమణయ్యల గురించి సంక్షిప్త రేఖా (వివరణ) చిత్రం ఇవ్వకుండా వాళ్ల ''డైలాగులకు'' దిగడం సమంజసం కాదునకుంటాను.

రమణయ్య వయస్సు 35. ఆయన PWD లో అసిస్టెంటు ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. ఇంజనీరింగ్ డిగ్రీ లేకపోయినా కూడా ఐ.టి.ఐ.నుంచి దొరికిన ఉపపట్టాతో ఆయనకు ఈరోజున్న హోదా సంపాదించటానికి ఎక్కువ ఆలస్యం ఏమీ కాలేదు. ఆయన ఇంటి పరిస్థితులు అంత తక్కువైనవేమీ కావు. ఇల్లుంది, పొలముంది. ఒక చిన్న కుటుంబాన్ని, ఆకలితో బాధపడకుండా పోషించడానికి తగిన ఆస్తిపాస్తులున్నాయి. ఇక కమలాక్షి మాటకొస్తే తలిదండ్రుల ఆర్థిక స్తోమత, ఆయనకున్న దానికంటే ఒకటి రెండు మెట్లు (రెట్లు) పైనే వుంది.

ఆమె ఏదో ముక్కీ మూలిగీ 10వ తరగతి పాసయింతర్వాత దేశ శ్రేయస్సు కోసం ఇంక పై చదువులు (ఉపరి పఠనం) వద్దని నిర్ణయం తీసుకున్న గొప్ప దేశప్రేమికురాలు. వాళ్ల వివాహమై ఇప్పుడు ఎనిమిది సంవత్సరాలు అయింది. ఆమెకు ఇప్పుడు 28 సం.లు కావడంవల్ల ఆమె తీయని పదిహేడులో మధువిధు (హనీమూన్) అనుభవించ లేదన్నమాట, నాలుగు + మూడు కలిస్తే ఏడు అనేది ఒక అవి -

తర్కితమైన నిజం. అదేరకంగా, ఇరవై ఇరవై ఐదు కలిస్తే గూడా మంచాలు విరగడం సాధ్యమవుతుంది అని ఆ యువ దంపతులు ఋజువు చేశారు. వాళ్ల దాంపత్య వల్లరి నుంచి ఒక మగ పుష్పం, ఆడ పుష్పం వికసితమైన తరువాత ఇక పుష్పంగాని, ఫలంగాని ఏమీ అక్కరలేదని వాళ్లు నిర్ణయించి ఇప్పుడు ఐదు సంవత్సరాలు దాటింది. ఆ పెద్ద పుష్పానికి వయస్సు, ఏడు సంవత్సరములే. అయితే, అతను ఒక శంతకాయగా తయారయ్యాడు. ఐదు సంవత్సరాలున్న లేత పుష్పం యొక్క అసలు లక్షణాలు ఇంకా బయట పడలేదు.

సుఖ సంతోషాలతో, మునిగి తేలుతున్న సంతృప్తి ఉన్న కుటుంబం వాళ్లది. అయినా కూడా అప్పుడప్పుడూ వాళ్లిద్దరూ ఒక మృదు కురుక్షేత్రానికి దిగుతూ వుంటారు.

ప్రతినెల ఒకటో తేది సాయంత్రం. కమలాక్షి చేతికి ఆయన నెల జీతం పొట్లాం అందుతుంది. ఇంటి బడ్జెట్ బాధ్యతలన్నీ ఆమెవే. భార్యా భర్తలకు వేరే వేరే బ్యాంకు ఖాతాలు వున్నా కూడా రమణయ్య జీతంనుంచి ఒక దమ్మిడీ కూడా ఆమె ఖాతాలోకి వెళ్ళదు.

అలాంటి జీతం డబ్బులు రావాల్సిన రోజే ఆరోజు. అందుకే ఆమె అడిగింది.

ఆ ప్రశ్న వినగానే మరో జేబునుంచి, జీతం డబ్బులున్న ఇంకో పొట్లం తీసి ఆమె చేతిలో (హస్తంలో నిక్షేపించాడు) పెట్టాడు.

''అయితే మరి ఆ పొట్లం ఏమిటి?'' అని ఆమె అడిగింది.

ఒక చిరునవ్వుతో ఆయన ఆ పొట్లాంలోంచి ఒక నిరోధ్ ప్యాకెట్‌ను తీశాడు.

''మీకు పిచ్చెక్కిందా? మనకు దీంతో ఏమి అవసరం? నాకు ఆపరేషన్ ఎప్పుడో అయిపోయింది కదా! కావాల్సిన రోజుల్లో కూడా దీన్ని వాడడం మీకు ఇష్టముండేది కాదుకదా!'' అని కొంచెం ఆశ్చర్యంతో ఆ భార్యామణి అడిగింది.

''నువ్వు రోజూ న్యూస్ పేపర్ చదవటం లేదు. అందుకే ఇలాంటి ప్రశ్న వేశావు. టి.వీలో వార్తలు వచ్చేటప్పుడు కూడా నీవు లేచి వెళ్ళిపోతావుకదా. సరే! ఈరోజు పేపరు నువ్వు చదివావా! ఈరోజు తేదీ ఏమిటో నీకు తెలుసా!''

భర్తగారి ప్రశ్నల పరంపర అలక సహించలేక కమలాక్షి జవాబిచ్చింది.

''ఈరోజు మొదటి తేదీ అని ఎవరికి తెలియదు. లేకపోతే ఈరోజు మీరు జీతం తెచ్చేవారు కాదుకదా!''

''జీతం దొరుకుతున్న మొదటి తారీకని నీకు తెలును. నెల, సంవత్సరం కూడా నీకు తెలుసా?''

''బాగా తెలును. ఈరోజు 1992 డిసెంబరు 1వ తారీఖు. అంత మాత్రం నాకు తెలియని గాడిదనుకున్నారా?''

''అయితే ఈరోజు ప్రత్యేకత ఏమిటో చెప్పు చూద్దాం''

అక్టోబరు 2న గాంధీ జయంతి అని చెప్పినట్లు, ఈరోజు ఎవరో పెద్ద మనిషి పుట్టి ఉంటారు లేదా చచ్చిపోయింటారు.

''నీకు బుద్ధిలేదని చెప్పేది ఇందుకే! పిచ్చిదానా, ''వరల్డ్ ఎయిడ్స్ డే'' ఈరోజు అని, దానివల్ల ప్రమాదమేమిటో, ఆ జబ్బు రాకుండా మనమేమి జాగ్రత్తలు తీసుకోవాలో అంతా రాసివుంది. నువ్వు అది చదవలేదా? తెలుగు పేపర్లో గూడా ఇది వుందే.''

''ఈ ఇంట్లో ఇంగిలిపీచు తెలిసిన వారు మీరు ఒకరే కదా! ఎయిడ్స్ అంటే నాకు కూడా అర్థమవుతుందండీ! దాన్ని గురించి మీరు ఎన్నో సార్లు అధిక ప్రసంగం చేశారు కదా! అయితే ఈ జబ్బు గురించి ఒక ఉత్సవం అవసరమా?''

''ఇది ఉత్సవం కాదు పిచ్చిదానా!, ప్రపంచంలో అదరికీ ఈ జబ్బు గురించి వివరాలు అందించడానికే ఈ రోగం రాకుండా వుండడానికీ ఏలాంటి చర్యలు తీసుకోవాలో తెలియపఱచడానికి ఈ దినాన్ని ''వరల్డ్ ఎయిడ్స్ డే''గా పాటిస్తున్నారు. ఈరోజు రాత్రి టి.వీలో దీనిని గురించిన చర్చా కార్యక్రమం ఉండవచ్చు.

''అది సరే, కాని, ఈ నిరోధ్ పాకెట్ మీరెందుకు తెచ్చారు. మనకిది అవసరం లేదు కదా!''

''మనకిది అవసరం లేదని ఎవరు చెప్పారు? పేపరు నువు శ్రద్ధగా చదువుతుంటే ఇలాంటి ప్రశ్న అడిగేదానివి కాదు''. లైంగిక సుఖం అనుభవించుటలో తప్పులేదు. కాని, అది సురక్షిత మార్గంలో వుండేలాగున చూసుకోవాలి. ఎల్లప్పుడూ నిరోధ్ వాడితే భయపడాల్సిన పనే లేదు. ఇది ప్రతి మానవుడు తప్పక అనుసరించవలసిన ఒక నియమం.'''

కమలాక్షి అక్షులలో నుంచి వేడి కన్నీరు ధారాపాతంగా ప్రవహించడం మొదలయింది.

అంటే! మీ అభిప్రాయంలో నాకు ఎయిడ్స్ వుందనేగదా! ఓ లమ్మో నేనింక బ్రతికి ఏం ప్రయోజనం''.

ఆరకంగా కమలాక్షి రోదించడం ప్రారంభించింది. రమణయ్యకు ఇంక ఏం చెప్పాలో? ఎలా ఆమెను ఓదార్చాలో అర్థం కాలేదు.

''కమలాక్షి, నేను చెప్పేది మొత్తం కొంచెం శ్రద్ధగా విను. క్యాన్సర్ అనే వ్యాధి రావడం గురించి ఎవరికైనాగాని ముందుగా తెలుస్తుందా! అది వచ్చిన - తర్వాత

గూడా తెలుసుకోవడం సులభసాధ్యం కాదుగదా! అది తెలిసేటప్పటికే చాలా ఆలస్యమవుతుంది. దానికంటే డేంజర్ ఈ ఎయిడ్స్ జబ్బు. కొంతమందికి ఈ జబ్బు వచ్చిన తర్వాత కొంతకాలం వఱకు దాని లక్షణాలు బయటకు రావు. అలాంటి రోగులను ఇంగ్లీషులో ''క్యారియర్స్'' అని చెబుతారు. పది, పదిహేను సంవత్సరముల వఱకు వాళ్లకు ఆరోగ్యంలో ఏమీ తేడాలేకుండా కూడా వుండవచ్చును. కాని వాళ్లద్వారా వేరే ఎంతో మందికి ఈ జబ్బు సంక్రమిస్తుంది.''

''మీరెప్పుడు చెప్పేవారు కదా! ఆడదోమలు మాత్రమే రక్తాన్ని పీలుస్తాయని. వాటి ద్వారానే మలేరియా లాంటి రోగాలు మనుష్యులకు వాస్తయని. అయితే ఈ జబ్బుకు కూడా మీరు అదేజాతిపై ఆరోపిస్తున్నారా!''

''కాదు కమలాక్షీ, ఆడవాళ్లు, మగవాళ్లు ఇద్దరి ద్వారా ఈ జబ్బు సంక్రమిస్తుంది.''

''మర్యాదగా బ్రతికితే ఈ జబ్బు వస్తుందా? చెడు తిరుగుళ్లు తిరిగితేనే గదా ఇది వచ్చేది?''

''అలా కాదు కమలాక్షీ మనమెప్పుడయినా, ఒక ఇంజక్షన్ తీసుకున్నామనకో, ఆ సూది ద్వారా ఈ జబ్బు రాకూడదని లేదు. తల్లికి జబ్బు వుంటే, తరువాత పుట్టిన పిల్లలకు తప్పకుండా వుంటుంది. ఒకడు వాడిన ''టూత్ బ్రష్''ను ఇంకొకడు వాడితే దానిద్వారా రావచ్చు. అలాగే, ఒకడు వాడిన బ్లేడ్ గాని కత్తిగాని, ఇంకొకడు గడ్డము చేసుకోవడానికి వాడితే ఈ జబ్బు రావచ్చు.''

''ఇలాంటివేం చేయకుండా వుంటే?''

''నీవు ఈ మధ్యన అంటే గత పది సంవత్సరాలలో ఎన్ని ఇంజక్షన్స్ తీసుకొని వుండవచ్చు? నేనెన్ని తీసుకొని వుండవచ్చు? ఆ రోజుల్లో మనము ఆ సూది సరిగ్గా స్టైరిలైజ్ చేశారా లేదా అని గమనించామా?''

''మీరేమి చెప్పినాగూడా, మీకు నామీద నమ్మకం లేకపోతే, నేను మా పుట్టింటికి వెళ్లిపోతాను. నావల్ల ఈ జబ్బు ఎవరికీ రాకుండా నేను చూసుకుంటా'' --- కమలాక్షి కన్నీరు విడుస్తూ అలా వుండిపోయింది.

''నీ ఏడుపూ గీడుపూ ప్రక్కన పెట్టు. నాకు ఇవ్వవలసిన టీ విషవ్యాధి మధ్య మఱచిపోయావు. తొందరగా వెళ్లి నాకు టీ తీసుకురా! ఈ మాటలు, ఏడుపూ తరవాత చూసుకోవచ్చు.''

''కమలాక్షి నిరీక్షణ వంటగదివైపు వెళ్లింది. రమణయ్యకూడా కొంచెం పరవశుడుగా మెల్లగా తన ప్యాంట్ విప్పి తనకు ప్రియమైన లుంగీలోకి ప్రవేశించాడు. దానితో ఆయనకు కొద్దిగా హాయిగా ఉన్నట్టు అనిపించింది.'' విముఖంగా వున్న కమలాక్షి

సుముఖమైన టీ తీసుకొని వచ్చింది. ఆ వేడి టీ లోపలికి వెళ్లగానే అతనికి కొంచెం ఉత్తేజం వచ్చింది.

''నిరోధ్ లేకుండా ఇకముందు ఎలాంటి లైంగిక సంబంధానికి నేను సిద్ధంగా లేను. నీవు ఇందులో ఏలాంటి ఆక్షేపణ చేయడానికి వీలులేదు. అని ఆయన గట్టిగా తీర్పు చెప్పాడు.''

''ఏడ్చి ఏడ్చి వాచిపోయిన ఆమె ముఖ కమలం ఇంకా వాచిపోయింది.''

''అలాగయితే, రేపు ప్రొద్దున్నే నన్నూ, నా పిల్లల్ని నా పుట్టింట్లో వదలిరండి. నామీద పూర్తి నమ్మకం లేని మనిషితో బ్రతకడం నాకూ ఇష్టం లేదు.''

ఇలా వాద ప్రతివాదాలు ఇంకా కొన్ని కొనసాగాయి. పిల్లలిద్దరూ భోంచేసి నిద్రపోయిన తర్వాతగూడా వాళ్లిద్దరూ ఇంకా వాదోపవాదాలలో మునిగి వున్నారు. చివరకు, రమణయ్య తన వాదాన్ని ఇలా ఉపసంహరించాడు.

''కమలాక్షీ నీగురించి నాకు నూటికి నూరుపాళ్లు నమ్మకం వుంది. నీద్వారా ఈ జబ్బు నాకు రాదని కూడా పూర్తిగా నమ్మకముంది. కాని, నామీద కూడా నీవు అంత నమ్మకం పెట్టగలవా. అలాగే నీవు కళ్లుమూసుకొని నన్ను నమ్మడం సమంజసంగా వుంటుందా! నేనెప్పుడూ బయటకు వెళ్లి తిరిగే మనిషిని కదా?''

కమలాక్షి మళ్లీ ఏడ్వడం మొదలు పెట్టింది.

''మళ్లీ మొదలు పెట్టావా నీకేమైనా చెప్పి తెలియజేద్దామంటే....'' అని అతను ప్రేమ పూర్వకంగా ఆమెను కోప్పడ్డాడు.

''మీరు చెప్పుకొచ్చేది వేరే ఆడవాళ్లతో మీకు సంబందం వుందనేగా?'' ఆమె వెక్కి వెక్కి ఏడ్చింది.

''అయితే ఇంతసేపు నేను చేసిన కంఠశోష నీ తలకెక్కి లేదన్నమాట. ఒసీ! ఆడవాళ్లతో వున్న సంబంధం ద్వారా మాత్రమే కాదీ ఈ జబ్బు వచ్చేది.''

''అవును, అవును అదికూడా నేను చదివాను. ఈ జబ్బు మగవాళ్ల మధ్యవున్న సంబంధంతో వచ్చిందని అదికూడా మొదటిసారి కోతులద్వారా మనిషికి వచ్చిందని నేను ఏవో వారపత్రికల్లో చదివాను. ఛీ, ఛీ, వేరే మొగవాళ్లతో కూడా మీకు అలాంటి పాడు సంబంధం వుందనేగా మీరు చెబుతున్నారు?'' అని ఆమెకు దుఃఖంలో జుగుప్సకూడా కలిగింది.

''కమలాక్షీ, కొద్దిగా నువ్వు ఓపిగ్గా వుండు. నేను చెప్పేది మొత్తం విను. నేను బయటకు పోయే రోజుల్లో, ఏదో ఒకసారి మంగలి షాపులో జుత్తు కత్తిరించుకొని వుండవచ్చు, లేక గడ్డం చేయించుకొని వుండవచ్చు. జ్వరం మాదిరి ఏదైనా

వచ్చినప్పుడు, ఒక డాక్టరు దగ్గరకెళ్లి ఒక ఇంజక్షను చేయించుకొని వుండవచ్చు. ఇంకా ఈ జబ్బు దోమలద్వారా కూడా రావచ్చో లేదో అనేది ఆ దేవుడికే తెలుసు. అందుకే, సురక్షితమైన కార్యక్రమానికి ఇది చాలా అవసరం. కదూ, నీకీ నిరోధ్‌తో ఎందుకు విరోధం?''

''నాకు దాంతో ఏం విరోదం లేదండీ. నామీద మీకుండే పూర్తి నమ్మకంలో ఏదైనా కొంచెంలోటు కలిగిందేమోనని భయపడి నాకు చాలా సంకటం కలిగింది. మీమీద అయితే నాకు పూర్తి నమ్మకం వుంది.''

''ఆ! అందుకే కదా ఇప్పుడు ఇంత రాద్ధాంతం చేసినావు'' అని అతను ఆమెను హేళన చేయడంతోపాటు, సాక్షాత్ శ్రీరామచంద్రమూర్తి గారి కలిగయుగ అవతారమని, తన వామ భాగం సర్టిఫికెట్ ఇచ్చినందుకు చెప్పలేనంత ఆనందం కలిగింది... దానితోపాటు కొద్దిగా అతనికి గిల్టీ ఫీలింగ్ కూడా.

---